# హరిత తోరణం బీబీపేట మండలం

- ప్రతి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా హరిత పందిళ్లు
- ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం
- చెట్లకింద సేదతీరుతున్న ప్రజలు



ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీళ్లు పోస్తున్న సిబ్బంది



యాడారం రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్టు

బీబీపేట్, అక్టోబర్ 3 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు చేపట్టిన హరితహారంతో బీబీపేట్ మండలం ఆకుపచ్చని తోరణంలా మారింది. బీబీపేట్ మండలంలోని ఆయా గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు సత్ఫలితాలనిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మొక్కలను పెంచి వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు నడుంబిగించింది. హరితహారంలో భాగంగా బీబీపేట మండల పరిధిలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. దీంతో మొక్కలు ఏపుగా పెరిగి బాటసారులకు కనువిందు చేస్తున్నాయి. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి రోగులకు ఇతర జనాలకు నీడనిస్తున్నాయి. తహసీల్ కార్యాలయ ఆవరణలో ఏపుగా పెరిగిన మొక్కలకు తహసీల్దార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రతి రోజూ సిబ్బంది నీళ్లు పోసి పెంచుతున్నారు. బీబీపేట పోలీస్‌స్టేషన్ హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగాపెరిగి పచ్చని తోరణంలా కనువిందు చేస్తున్నాయి. మాందాపూర్, ఉప్పర్‌పల్లి, ఇస్సానగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, మండల కేంద్రంలోని బాలుర, బాలిక ఉన్నత పాఠశాలల్లో హరితహార కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. దీంతో విద్యార్థులకు నీడతోపాటు స్వచ్ఛమైన గాలిని కూడా అందిస్తున్నాయి. మండలంలోని జనగామ మర్రి నుంచి మాందాపూర్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. దోమకొండ నుంచి బీబీపేట్‌కు వెళ్లే ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు పచ్చదనంతో ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. బీబీపేట్ నుంచి యాడారం, యాడారం నుంచి కోనాపూర్, బీబీపేట్ నుంచి తుజాల్‌పూర్, తుజాల్‌పూర్ నుంచి మల్కాపూర్ తదితర గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు పచ్చతోరణంలా బాటసారులను ఎంతగానో ఆకర్షితున్నాయి.

### ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్నాయి



రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో హరితహారం కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజలు కలిసికట్టుగా మొక్కలు నాటి విజయవంతం చేశారు. సీఎం కేసీఆర్ హరిత తెలంగాణ కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు.

**- పరికి ప్రేమ్‌కుమార్, జడ్పీ వైస్ చైర్మన్**

### ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోస్తున్నాం



రోడ్డుకు ఇరువైపులా, బహిరంగ ప్రదేశాల్లో నాటిన మొక్కలకు వారానికి మూడు సార్లు నీటిని పోసి బతికిస్తున్నాం. మొక్కలకు నీరందించడంతో అవి ఏపుగా పెరిగాయి.

**- పూర్ణ చంద్రోదయకుమార్, ఎంపీడీవో**

### పచ్చదనంతో కళ కళ లాడుతున్న రోడ్లు



మండలంలోని అన్ని గ్రామాల్లో హరితహారంలో భాగంగా రోడ్లుకు ఇరువైలా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చని తోరణంలా కనిపిస్తున్నాయి. బాటసారులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

**- వెంకట్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు**

### కలిసికట్టుగా మొక్కలు నాటాలి



అందరూ కలిసికట్టుగా మొక్కలు నాటాలి. వర్షాలు సమృద్ధిగా కురవాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలి. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. రోడ్డుపై వెళ్లే వాహనదారులు, పాదచారులకు ఏపుగా పెరిగిన మొక్కలు కనువిందు చేస్తున్నాయి.

**- ఇంద్రసేనారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్**

## యాదవ సంఘ భవనానికి నిధులు మంజూరు



ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ నుంచి ప్రొసీడింగ్ కాపీని అందుకుంటున్న యాదవ సంఘ నాయకులు

కామారెడ్డి, అక్టోబర్ 3 : జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో యాదవ సంఘానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. అశోక్‌నగర్ యాదవ సంఘం సభ్యులు ప్రభుత్వ విప్‌ను పట్టణంలోని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ విప్ నుంచి ప్రొసీడింగ్ కాపీని అందుకొని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, యాదవ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్, లక్ష్మీపతి యాదవ్, కుంబాల లక్ష్మణ్, ప్రభాకర్ యాదవ్, ప్రకాశ్‌యాదవ్, మురళి యాదవ్, రాజేశ్‌యాదవ్, చందు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమం



మహిళా సంఘాల సభ్యులకు ఈవీఎం ద్వారా ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు


రాజంపేట్, అక్టోబర్ 3 : మండలంలోని కొండాపూర్ గ్రామంలో తహసీల్దార్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈవీఎంల ద్వారా మంగళవారం ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలో మహిళా సంఘం సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల స్వరూపాకృష్ణమూర్తి, జడ్పీటీసీ కొండా హన్మాండ్లు, సర్పంచ్ శెనిశెట్టి స్వాతి, పంచాయతీ కార్యదర్శి, సీసీలు, వీవోఏలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రైతులకు పోడు పట్టాలు ఇవ్వాలి

మాచారెడ్డి, అక్టోబర్ 3 : అర్హులైన రైతుల పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు నర్సయ్య తహసీల్దార్ శ్వేతకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని బంజపల్లి, వెనుకతండా, నడిమి తండా, గుంటితండా, ఎల్లంపేట, అక్కాపూర్ గ్రామాల్లో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో భూమయ్య, కిష్టయ్య, అలీ తదితరులు ఉన్నారు.

## ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి గడువు పొడిగింపు

కామారెడ్డి, అక్టోబర్ 3 : తెలంగాణ ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్‌లో 2023–24 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశం పొందేందుకు ఈ నెల 13వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టీఎస్ ఆన్‌లైన్, ఏపీ ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



భిక్కనూరులో ఇటీవల ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయించి ప్రారంభించారు. గతంలో చిమ్మ చీకట్లలో కనిపించే భిక్కనూరు నేడు రంగు రంగుల విద్యుద్దీపకాంతుల్లో వీరాజిల్లుతుండడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– భిక్కనూరు, అక్టోబర్ 3 :

## ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

### అదనపు కలెక్టర్ చంద్రమోహన్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి, అక్టోబర్ 3 : రాబోయే శాసన సభ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తక్షణమే ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందని, ఆనాటి నుంచే ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయ నియంత్రణను మానిటరింగ్ చేసేందుకు కమిటీ సమాయత్తం కావాలన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు పరిచే ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, సర్వైవల్ స్టాటిస్టికల్ టీమ్, వీడియో సర్వైవల్ టీమ్, వీడియో వీవింగ్ టీములకు సంబంధించిన సహాయ వ్యయ పరిశీలకులను నియమించుటకు ఏర్పాటు చేసిన కమిటీలకు ఆమోదం తెలిపారు. అధికారులు సరైన శిక్షణ పొంది ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడానికి కృషి చేయాలన్నారు. అందుకు తగిన విధంగా శిక్షణ, అవగాహన పొందాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, సీపీవో రాజారామ్, జిల్లా ఆడిట్ అధికారి కిషన్, డీపీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో మైసూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే జాజాల సురేందర్ పర్యటన

రాజంపేట్, అక్టోబర్ 3 : రాజంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ బుధవారం పర్యటించనున్నారని బీఆర్ఎస్ మండల కార్యదర్శి గడ్డం బాల్‌రాజురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సౌత్‌జోన్ హాకీ చాంపియన్ షిప్‌నకు ఎంపిక



శ్రావ్య

కామారెడ్డి, అక్టోబర్ 3 : కామారెడ్డి జిల్లాకు చెందిన తిగిరంచ శ్రావ్య సౌత్ జోన్ హాకీ చాంపియన్‌షిప్ 2023లో పాల్గొనేందుకు తెలంగాణ హాకీ సబ్ జూనియర్ ఉమెన్ టీమ్‌కు ఎంపికైంది. ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో నిర్వహించే సౌత్ జోన్ హాకీ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొంటారు. ఈ సందర్భంగా హాకీ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నీలం లింగం, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, ట్రెజరర్ నోముల మధుసూదన్ రెడ్డి, కోచ్ ఆంజనేయులు ఆమెను అభినందించారు.

## అంబేద్కర్ భవన ప్రారంభోత్సవానికి తరలిరావాలి

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 3 : బాన్సువాడ పట్టణంలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ భవన్‌తో పాటు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ఆవిష్కరణ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా బుధవారం ప్రారంభోత్సవం ఉంటుందని, ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని దళితులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని దళిత నాయకులు కోరారు. మంగళవారం బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మండలంలోని బోర్లం, హన్మాజీపేట్, కోనాపూర్, కాద్లాపూర్ గ్రామాల్లో దళిత నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కృషితో నియోజకవర్గ దళితుల కోసం అంబేద్కర్ భవన్ నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిలు, అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, దళిత నాయకులు మన్నె చిన్న సాయిలు, డాకయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



హన్మాజీపేట్ గ్రామంలో యువకులతో దళిత నాయకులు